ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని ఇటీవల చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల చోరీలపై పోలీసులు నిఘా ఉంచి కీలక పురోగతి సాధించారు. చింతపల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేసిన సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను నిలుపుదల చేశారు. ఆధార్ కార్డులు, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. విచారణలో చోరీకి గురైన మూడు పల్సర్ బైకులువాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులపై కేసులు నమోదు చేశారు.

స్వాధీనం చేసుకున్న బైకులు

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులకు అన్యాయం జరిగితే ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశమందిరంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అట్రాసిటీ కింద నమోదు అయిన కేసుల పరిష్కార చర్యల పై ఆయన సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ, గిరిజనుల ఆస్తుల ధ్వంసం, మోసం చేయడం, భౌతిక దాడులు వంటి చర్యల పై నిఘా పెట్టాలని, అటువంటి ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. గత ఐదు నెలల్లో పిజిఆర్ఎస్‌కి భూ ఆక్రమణలు, అట్రాసిటీకి సంబంధించి అనేక కేసులు వస్తున్నప్పటికీ పోలీస్ స్టేషన్లలో ఎందుకు ఫైల్ కాలేదని ఆరా తీసారు. ఎస్సి, ఎస్టి చట్టాలు, వాటి వినియోగం, భూ ఆక్రమణలు, అట్రాసిటీ, దౌర్జన్యాలు తదితర కేసులకు సంబంధించి గిరిజనులకు పూర్తి అవగాహన కల్పించాలని, పోలీసు శాఖ అధికారులు కూడా అవగాహన పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశానికి హాజరు కానీ ఎస్డిపిఒ లకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి నెలలో ఒకసారి సివిల్ రైట్స్ డే నిర్వహించి గిరిజన ప్రజలకు పిఓఎ చట్టం పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నేలా ఆఖరి శనివారం ప్రభుత్వ భూముల ఆక్రమనలు, వాటర్ బాడీలపై ప్రత్యేక దృష్టి సారించి అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశానికి సరైన పూర్తి సమాచారం లేకుండా హాజరవడం, అధికారుల గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయి సమావేశానికి ముందుగానే సబ్ డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అరకు శాసన సభ్యులు రేగం మత్స్యలింగం, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కె.పద్మలత, అదనపు ఎస్పీ ధీరజ్, గిరిజన సంక్షేమ డిడి ఎల్.రజని, డిఇఒ పి.బ్రహ్మాజీ రావు, కార్మిక శాఖ అధికారి టి.సుజాత, కన్వీనర్, సాంఘిక సంక్షేమ అధికారి జి.జనార్ధనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

-ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక రంపచోడవరం గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఈత పల్లి సిరిమల్లిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు మాట్లాడుతూ గిరిజనులకు స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. మెగా డిఎస్సిలో ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్‌పోస్టులు మినహాయించాలని పోరాడుతున్నా ప్రభుత్వం చొరవ చూపించకపోవడం అన్యాయమన్నారు. ఆదివాసులకు మద్దతుగా ప్రజలతో మమేకమై మరో పోరాటానికి సిద్ధమవుతు న్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్, జిల్లా కార్యదర్శి పులిసంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పునేంప్రదీప్, తీగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో..

జిల్లాలో కంట్రోల్ రూముల ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు:రానున్న 48 గంటలలో కొన్ని ప్రాంతాలలో పిడుగులు, కొన్ని ప్రాంతాలలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని, అదేవిధంగా గంటకు 60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన కేంద్రంలో 24 గంటలు పని చేసే విధంగా 08935-293448 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా మూడు ఐటిడిఎల పరిధిలో సబ్ కలెక్టర్ కార్యాలయాలలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఫోన్ నంబరు 08935-250228, రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఫోన్ నంబరు 6300772025, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఫోన్ నంబరు 8121729228. ఆయా నంబర్లలో సిబ్బంది షిఫ్టుల వారిగా 24 గంటలు విధులు నిర్వర్తించాలని, అవాంచనీయ, అనుకోని సంఘటనలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ప్రధాన కేంద్రాలలో అందుబాటులో ఉండి ఎటువంటి అవాంచనీయ సంఘటనలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు గెడ్డలు, వాగులు దాటరాదని కలెక్టర్ సూచించారు.

అవగాహన కల్పిస్తున కుంజం నందిని

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం డివి కోట పంచాయతీలో దెందులూరు, దొరచింతలపాలెం ,శ్రీపురం, నరసాపురం, గురమామిడి, డివికోట గ్రామాల్లో ఆర్‌వైఎస్ఎస్ ఎపిసిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. 'జై ప్రకృతి వ్యవసాయం, జై నేలతల్లి 'జై గోమాత' అజోలా ఉండగా యూరియా దండగ అంటూ నినాదాలు చేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తనం వేసిన దగ్గర నుంచి పంట తీసేంతవరకు మోడల్స్ వేస్తున్న రైతులకు ఎంపిక చేసి తోటి రైతులు సన్మానించారు. వరి పంట వేసే ముందు ప్రధాన పంట దిగుబడి కోసం నవధాన్యాలు (పిఎండిఎస్) ప్రతి రైతు పొలంలో భూసారం కోసం వేయించడం కోసం జరిగింది. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నవెంకటరమణ

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఆడిట్) పి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు.అల్లూరి జిల్లాలో అరకులోయ, డుంబ్రిగూడ మండలాల్లో బుధవారం గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పి వెంకటరమణ క్షేత్ర స్థాయి పర్యటన చేసి పరిశీలించారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గృహ నిర్మాణ శాఖ ద్వారా అమలు జరుగుతున్న పిఎంఎవై (గ్రామీణ) అదిమజాతి గిరిజనులకు ప్రత్యేక పథకం పిఎం - జన్మన్‌లో నిర్మిస్తున్న ఇండ్లను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు, బాగోగులు అడిగి తెలుసుకొన్నారు. గృహ నిర్మాణం వేగవంతం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు, డిఈఈ రాజుబాబు, ఏఈలు క్రాంతి, నాగేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టాలి

-జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:రాజుపాక బీటి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరామని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు తెలిపారు. బుధవారం అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో జరుగుతున్న రోడ్డు పనులను సర్పంచ్ సోమ్మెల .రూతుతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దృష్టికి ఈ రోడ్డు సమస్య తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ మేరకు లక్ష్మీపురం మెయిన్ రోడ్డు నుండి బెడ్డగుడ గ్రామం మీదుగా రాజుపాక గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు పనులు నాణ్యతగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్. నాగులు, గ్రామస్తులు సుబ్బారావు, రాజు, భీమన్న, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న గంగరాజు

దుకాణాల వద్ద మందుబాబుల హల్‌చల్

ప్రజాశక్తి-చింతపల్లి:మండల కేంద్రంలోని గ్రామం నడిబొడ్డున ఉన్న మద్యం దుకాణం వద్ద మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు.మద్యం కొనుగోలు చేసిన మందుబాబులు దుకాణ సముదాయాల వద్దే మద్యం సేవిస్తూ, ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ కప్పులు, చెత్తచెదారం వదిలి వెళ్లిపోతున్నారు. దీంతో, వ్యాపార స్థలాల పరిసరాలు అసహ్యకరంగా మారిపోయాయని స్థానిక దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబుల హల్‌చల్‌తో కస్టమర్లు రాక తగ్గిపోయిందని వ్యాపారులు తెలిపారు. రాత్రి వేళల్లో దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఒక వ్యాపారి వేదన వెలిబుచ్చారు. అధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని మద్యం దుకాణాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని వారు కోరారు.

తాగి పడేసిన బాటిల్స్

2 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, సహాయ గిరిజన సంక్షేమ శాఖలో ఈ నెల 31కి 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుని దరఖాస్తు సమర్పించని వారు, దరఖాస్తు చేసుకున్న నాల్గో తరగతి, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఈ నెల 30వ తేదిన రంపచోడవరం ఐటిడిఎ సమావేశభవనంలో హాజరు కావాలని పిఒ ఒక ప్రకటనలో తెలిపారు. మే 15న నాన్‌టీచింగ్ ఉద్యోగులకు, నాల్గోతరగతి సిబ్బందికి మే 16 నుంచి జూన్ 2 వ తేదీలోపు బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. 26 గడువు తేదీ లోపు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.

రహదారులకు మోక్షం లేదా ?

ప్రజాశక్తి -సీలేరు: రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మారుమూల గిరిజన గ్రామాలకి రహదారులు వైద్య సదుపాయాలు కల్పించక పోవడంతో గిరిజనులు మృత్యువాత పడుతున్నారని జికె వీధి మండలం ఏ.దారకొండ ఉపసర్పంచ్ మురళ చంటిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ ఏ.దారకొండ పంచాయతీ తడకపల్లి గ్రామానికి చెందిన చిన్నబ్బాయి (52) మూడు నెలలుగా అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందాడని వాపోయారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అతనిని తీసుకెళ్లలేకపోయామని, వైద్యసదుపాయం కూడా లేదన్నారు. అత్యవసర సమయంలో కూడా చాలామంది ప్రాణాలు కోల్పోయారన్నారు. గొల్లపల్లిలో మినీ సబ్‌సెంటర్ ప్రభుత్వం మంజూరు చేసి సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టలేదని మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వలనే గిరిజనుల మరణాలు సంభవిస్తున్నాయని తక్షణమే జిల్లా కలెక్టర్ ఐటిడిఎ పిఒ స్పందించి గొల్లపల్లిలో సబ్‌సెంటర్‌ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన చిన్నబ్బాయి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

మృతి చెందిన చిన్నబ్బాయి

మాక్‌డ్రిల్ చేస్తున్న సిబ్బంది

అటవీ శాఖ మాక్ డ్రిల్

ప్రజాశక్తి-అరకులోయ:జిల్లాలో తరచూ అగ్ని ప్రమాదాలకు గురయ్యే అటవీ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల బృందం సభ్యులతో అరకు వ్యాలీలో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పాడేరు డివిజనల్ అటవీ అధికారి కె.సందీప్‌రెడ్డి తెలిపారు. మంగళ, బుధ వారాలలో అరకు వ్యాలీలో నిర్వహించిన మాక్ డ్రిల్‌తో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా విపత్తుల సమయాలలో మెలుకువలను వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. అటవీ సిబ్బందికి ఈ డ్రిల్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాల నుండి రక్షణ, నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి డిఎఫ్ఓ వెంకట నరసింహ రావు , ఎన్‌డిఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్ కుమార్, సబ్ డిఎఫ్ఓ ఉమా మహేశ్వరి, ఎన్‌డిఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్లు అరుణోదయ్ ద్వివేది, నాగేంద్ర సింగ్ యాదవ్, ఎస్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు లావణ్య, వెంకయ్య చౌదరి, రాజ బాబు, అప్పలనాయుడు, గంగరాజు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా దేవదాస్

ప్రజాశక్తి- డుంబ్రిగుడ:-అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా మండలంలోని సాగర పంచాయతీ ఎంపిటిసి వంతల దేవదాసును ఎంపిక చేస్తూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ నియమించినట్లు దేవదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంప్రదాయ కళలు, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం సేవ చేస్తూ, ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్న తనను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకు లోయ: ఈనెల 30న విశాఖ ఆరిలోవ మెడికవర్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అరకు లోయలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ బుధవారం తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో సికిల్ సెల్ ఎనీమియా, థైరాయిడ్, ఇతర రక్త క్యాన్సర్ల పై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన ప్రాంతంలోని ప్రజలు రోగగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఆస్పత్రిలోని 4 నెంబర్ రూములో వైద్య శిబిరం నిర్వహించ బడుతుందన్నారు. మరిన్ని వివరాలకై ఫోన్: 7330 694545, 8184880 729,79971 50470 నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

వేడుకగా గంగాలమ్మ జాతర

ప్రజాశక్తి - గంగవరం : మండలంలోని నూగుమామిడిలో గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆలయ కమిటి సభ్యులు, గిరిజనులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. జాతరకు అయ్యే ఖర్చు రెండు లక్షలు కంబాల శ్రీనివాసరావు విరాళంగా అందజేశారు. గిరిజన సాంస్కృతిక, సాంప్రదాయ నృత్యాలు, ఆటల పోటీలను తిలకించారు. గిరిజనులతో కలిసి కోలాటం నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు పరిరక్షించుకోవడం కోసం ఏజెన్సీ ప్రాంతంలో జాతరలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరికి ఏ సాయం కావాలన్నా తన వద్దకు వస్తే సహాయం చేస్తానన్నారు. గంగవరం మండలం అముదాలబంద గ్రామాన్ని ఆయన సందర్శించారు. వినాయక, రామాలయం ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. రామాలయం అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి, గోకవరం బిజెపి మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, వనవాసి కల్యాణ ఆశ్రమం జిల్లా అధ్యక్షులు కాటం రెడ్డి, ఎస్టి మోర్చా జిల్లా కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు, సమరసత పౌడేషన్ డివిజన్ ప్రచారక్ విశ్వనాథం, పలకశెట్టి శ్రీను, ఆనంద్ కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు..

కోలాటం ఆడుతున్న మహిళలు

గంజాయి పట్టివేత : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ చింతూరు అడిషనల్ ఎస్పి పంకజ్ కుమార్‌మీనా ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. చింతూరు సిఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చింతూరు బస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమా నితులు ఇద్దరిని ఎస్ఐ రమేష్ పట్టుకున్నారు. చింతూరు బస్టాండ్‌లో బుధవారం రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న గంజాయితోపాటు, ఇద్దరు అనుమానిత వ్యక్తులను చింతూరు ఎస్ఐ రమేష్ సోదా చేసి ప్రశ్నించగా సంచుల్లో ఉన్న 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ 1,50,000 ఉంటుందని తెలిపారు. కేసులో చిత్తూరు జిల్లాకు చెందిన గుండ్ల ఘటం రవిచంద్రన్ విజయ్, కండిగ రాజశేఖర్‌ను అరెస్ట్ చేశారు.

పట్టుబడ్డ నిందితులు

సోలార్ లైట్లు, ఎలక్ట్రికల్ వస్తువుల పంపిణీ

లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ వస్తువులు పంపిణీ చేస్తున్న సూరిబాబు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత సచివాలయం వద్ద బుధవారం చికిలింత, కొమరాపురం గ్రామాలకు చెందిన పొలాల్లో నివసిస్తూ కనీస విద్యుత్ సౌకర్యం లేని 20 కొండరెడ్డి కుటుంబాల వారికి రూ.14 లక్షలు విలువైన సోలార్ లైట్లు, సామగ్రిని గిరిజన సంఘం మండల కార్యదర్శి, సర్పంచ్ కోండ్ల సూరిబాబు బుధవారం పంపిణీ చేశారు. ఎపిఇపిడిసిఎల్ వారి నివేదిక ప్రకారం సోలార్ సిస్టమ్ కంపెనీ వారు వీటిని అందించారని సోలార్ సిస్టమ్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో కుటుంబానికి ఐదు బల్బులు, ఒక ఇన్వెర్టర్, ఒక స్టాండ్ ఫ్యాన్, 300 వాట్స్ సామర్థ్యం గల ఒక సోలార్ ప్యానల్, రెండు ఎక్స్‌టెన్షన్ బాక్సులు, సోలార్ సౌకర్యం ఏర్పాటుకు స్ట్రక్చర్ ఇచ్చామన్నారు.

వై.రామవరం మండలంలో కూడా 30 కుటుంబాల వారు అర్జీ చేసుకొన్నారని అన్నారు. పియం జన్‌మన్ పథకంలో ఇప్పటికే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామని శ్రీనివాస్ వెల్లడించారు. దరఖాస్తుదారులు మృతి చెందిన వారు ఎవరైనా ఉంటే వారికి ఇవ్వడం జరగదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోండ్ల సూరిబాబు, సీనియర్ ఇంజనీర్ శ్రీనివాస్, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ బీరబోయిన ప్రసాద్, కార్యదర్శి కోనేటి రాంబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీ అధికారంలోకి రావాలంటే యువత కీలకం

వైసిపి ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.రాజు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: పార్టీ అధికారంలోకి రావాలంటే యువత పాత్ర చాలా కీలకం అని వైఎస్ఆర్‌సిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.రాజు అన్నారు. విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉరుకూటి చందు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా యువజన విభాగం సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కె.కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షపార్టీ కార్యకర్తలు నాయకులపై చేస్తున్న దాడులకు గాని కుట్రలకు గాని మనం ఎవరూ భయపడాల్సిన పనిలేదని తప్పకుండా పార్టీ ప్రతి ఒక్కరికి తోడుగా నిలుస్తుందన్నారు. 2029లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నూటికి నూరుశాతం పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం చేకూరే విధంగా జగన్ 2.0 పరిపాలన ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మనం ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా కోర్టు కేసులు వేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్, పి.వి.సురేష్, ఉరుకూటి చందు, ఇమ్రాన్, రవిరెడ్డి, వాసు, రాయపురెడ్డిఅనిల్, మువ్వల సంతోష్, ఎల్లపు శ్రీను, వార్డు యూత్ ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సాయం అందిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలో పర్రెడ పంచాయతీ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తీక్ ప్రసాద్ ఈనెల 18 న మృతి చెందటంతో అల్లూరి జిల్లా యూనియన్ పిలుపు మేరకు కుటుంబసభ్యులకు బుధవారం ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిందించారు కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎఎస్ఇ కోశాధికారి చాణక్య, పెదబయలు యూనియన్ అధ్యక్షులు బొంజుబాబు, జీ మాడుగుల అధ్యక్షులు పి సింహాచలం, పాడేరు డివిజన్ నాయకులు పాల్గొన్నారు

నేడు బొర్రాలో యోగాంధ్ర

ప్రజాశక్తి -అనంతగిరి: యోగాంధ్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు పర్యాటక కేంద్రాలలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా ఈనెల 29న గురువారం ఉదయ ఏడు గంటలకు అనంతగిరి మండలం బొర్రా గుహలు పర్యాటక కేంద్రంగా బొర్రా పంచాయతి గేటువలస గిరిజన సంక్షేమ పాఠశాలలో సుమారు వెయ్యి మందితో యోగాభ్యాసన జరుగుతుందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది పాల్గొవాలన్నారు.

అపోలో వైద్యునికి అరుదైన గౌరవం

ఎస్ఐసిఒటి ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌కు డాక్టర్ అబ్దుల్‌ఖాన్ పరిశోధనా కథనాలు

డాక్టర్ అబ్దుల్‌ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ ఏడాది సెప్టెంబరులోని స్పెయిన్‌లో మాడ్రిడ్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామాలజీ (ఎస్ఐసిఒటి) ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌లో అపోలో వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్.డి.ఖాన్ సమర్పించిన మూడు శాస్త్రీయ పరిశోధన కథనాలు అమోదించబడ్డాయి. ఈ మేరకు ఎస్ఐసిఒటి కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ ఆయనకు ఆహ్వాన లేఖను పంపించింది. ఎస్ఐసిఒటి ఆర్థోపెడిక్ వరల్డ్ కాంగ్రెస్‌కు డాక్టర్ ఖాన్ కథనాలు ఎంపిక కావడం ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది. శాస్త్రీయ కథనాలలో మన రాష్ట్రంలో మొదటిసారిగా డాక్టర్ ఖాన్ చేసిన అరుదైన, వినూత్న శస్త్రచికిత్సలు ఉన్నాయన్నారు. భుజం స్నాయువు చీలిక కోసం రిజినెస్ట్ బయో ఇంప్లాంట్, మోకాలి పాక్షిక చీలిక కోసం యాంటిరియర్ క్రూసియేట్ లిగ్‌మెంట్(ఎసిఎల్) చిలిక కోసం రేడియోఫ్రీక్వెన్సీ థర్మల్ ష్రింకేజ్(ఆర్ఎఫ్‌టిఎస్) వంటి విజయవంతమైన శస్త్రచికిత్సలు ఉన్నాయి.

జూ పార్కులో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ ధోల్ డే సందర్భంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో బుధవారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఆసియాటిక్ వైల్డ్ డాగ్(ధోల్)పై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ధోల్ జీవనశైలి, నివాస ప్రాంతాలపై తమ సృజనాత్మకత, ఆలోచనలను చిత్రలేఖ రూపంలో వ్యక్తీకరించినట్టు తెలిపారు. కార్యక్రమం ద్వారా ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో ధోల్ సంరక్షణ, వాటి ప్రాధాన్యత గురించి విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తెలుసుకున్నారన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

డిఎస్‌సి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన డిఎస్‌సి మోడల్ పరీక్షను బుధవారం ద్వారకానగర్ గాయత్రి కోచింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, నిరుద్యోగుల తరపున నోటిఫికేషన్ విడుదల కోసం పోరాటం చేయడమే కాదు, చదువులో కూడా వారికి సహకారం అందించాలని మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా మోడల్‌టెస్ట్ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

యుజెఎఫ్ హ్యాండ్‌బుక్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

యుజెఎఫ్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యుజెఎఫ్) హ్యాండ్ బుక్‌ను విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుజెఎఫ్ ప్రతినిధులు కె.రాము, డాక్టర్ ఎంఆర్ఎన్. డి.హరనాథ్, బి.నారాయణరావు, రవి పాల్గొన్నారు.

కంటి అద్దాలు అందిస్తున కెసిజిఎఫ్ ఫెమినా క్లబ్ ప్రెసిడెంట్ శారద తదితరులు

కంటి అద్దాల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వాసవి క్లబ్, విశాఖ కంటి ఆసుపత్రి, విబార్ట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన గత నెలలో నిర్వహించిన కంటి పరీక్షల్లో కంటి అద్దాలు అవసరమని గుర్తించిన 10 మంది నిరాశ్రయుల్లో 8 మందికి బుధవారం ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత కెసిజిఎఫ్ ఫెమినా క్లబ్ ప్రెసిడెంట్ శారద, విజయలక్ష్మి, ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి



ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ టి ఆర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడనీ కొనియాడారు. రాజకీయాలలోనూ బాగా రాణించారని తెలిపారు. రేషన్ బియ్యాన్ని రూ.2కి ఇవ్వడం, మహిళా అభివృద్ధికి ప్రత్యేక పథకాలు, పేదలకు గృహ నిర్మాణ పథకాలు, ప్రజల వద్దకే పాలన వంటివి నేటికీ ఆదర్శంగా ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జేసి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం జే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్‌ఓ కే.పద్మలత, జిల్లా అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చింతూరు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నేషనల్ ఫ్రంట్ చైర్మన్ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ కార్యాలయం, ఐటిడిఎ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి అపూర్వభరత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పిఒ అపూర్వభరత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు జిల్లా చిన్నారెడ్డి, మాజీ సీనియర్ అధ్యక్షులు ఓబులునేని రామారావుచౌదరి, ఎండి జహంగీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగ వేణి, నూకచారి, మార్కెట్ కమిటీ సభ్యులు ఈ సాల్మన్ రాజు, సురేష్ చౌదరి, నరసింహారావు, ఎండి రియాజ్, శ్రీరామ్, కట్టశంకర్, పొదిలి రామారావు, చిన్న ముత్తయ్య వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ఎన్‌టిఆర్ జయంతి అడబాల బాపిరాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అడబాల బాపిరాజు మాట్లాడుతూ 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడబాల బాబి రాజు, పెంటపాటి అనంతమోహన్ పాటోజు సురేష్ సలాది బాపిరాజు పాల్గొన్నారు.

చింతూరులో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న ఐటిడిఎ పిఒ, టిడిపి నేతలు



రంపచోడవరంలో కేకు తినిపించుకుంటున్న తెలుగుదేశం నేతలు

8న స్వాతి నక్షత్ర హోమంపై ప్రచారం

ప్రజాశక్తి- వేపగుంట : జూలై నెలలో జరగనున్న సింహాద్రి అప్పన్న గిరిప్రదక్షిణ సజావుగా సాగేందుకు ఇప్పటినుంచే దృష్టి పెడుతున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, ఆర్‌జెసి వేంద్ర త్రినాథరావు అన్నారు. ఇఒగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత దేవస్థానంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వాటి నివారణతోపాటు మున్ముందు జరిగే ఉత్సవాల నిర్వహణపై ఎఇఒలు, ఇతర అధికారులతో సమీక్షించారు. వచ్చేనెల 8న అప్పన్న స్వామి సన్నిధిలో జరిగే స్వాతి నక్షత్ర హోమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులు ఆదేశించారు

కళ్యాణ మండపంలో జరిగే హోమాన్ని ఎక్కువమంది భక్తులు తిలకించేదుకు వీలుగా అక్కడున్న ఉత్సవ వాహనాలు, ఇతర వస్తువులను తొలగించాలని సూచించారు. దేవస్థానం పరిధిలో పాడుబడిన భవనాలు, గోడలు స్థితిపై ప్రత్యక్ష పరిశీలన జరిపి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండాచర్యలు చేపడతామన్నారు. అన్నదాన సత్రంలో వంట బాయిలర్స్, భక్తుల సమస్యలపై ఎఇఒలు ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాసరావుతో చర్చించి, అవసరమైతే నూతన యంత్ర సామగ్రి కొనుగోలు చేయాలని మౌఖికంగా ఆదేశించారు. ప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టాలన్నారు. కొత్త ఇఒ రాకతో సింహాద్రి అప్పన్న సన్నిధిలో లోపాలు, సమస్యలు ఏమేరకు గాడిలో పడతాయో చూడాలి.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎన్‌టిఆర్ మహానటుడే కాదు, మహా మనిషి, సంఘసంస్కర్త అని, ఆయనతో నాలుగున్నరేళ్ల ప్రయాణించడం మరిచిపోలేని మధురానుభూతి అని పద్మ విభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్‌తో కేవలం సహాయకునిగా తన భాషా పాండిత్యాన్ని అందివ్వగలిగానన్నారు. బుధవారం పౌర గ్రంథాలయంలో వజ్రోత్సవాల్లో భాగంగా రాగమాలిక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సంగీత విభావరి నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌ను చూసి జీవితంలో అనేక విషయాలు నేర్చుకోవాలన్నారు సంగీత కార్యక్రమాన్ని కళా ప్రముఖులు సన్ మూర్తి ,మహమ్మద్ ఖాన్, చౌదరి అప్పారావు, కెవి సత్యనారాయణ, పార్థసారథి, ఫణి స్వామి, రాజశేఖర్, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరానికి చెందిన గాయనీగాయకులు శ్రీనివాసరెడ్డి, ఇందిరా సాహిని, మీనా కుమారి, బొమ్మిడి సత్యనారాయణ, తదితరులు ఎన్‌టిఆర్ నటించిన చిత్రాలలో గీతాలను ఆలపించి అలరించారు.

ఆశా కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీలేరు: ఆశా కార్యకర్త పాంగి సత్యవతి మూడు నెలల నుంచి విధులకు డుమ్మా కొడుతోందని తక్షణమే చర్యలు చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేశారు. జికె వీధి మండలం దారకొండ పంచాయతీ కొంగపాకల గ్రామంలో పాంగి సత్యవతి ఆశా కార్యకర్తగా గత కొన్నాళ్లుగా విధినిర్వహణలో ఉన్నారు. తరచూ విధులకి డుమ్మా కొడుతోందని గ్రామస్తులు ఆరోపించారు. ఎందుకు విధులు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తులు అడిగితే వ్యక్తిగత దూషణకి దిగుతోందని పలుమార్లు దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి హిమబిందు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అధికారులు స్పందించి ఆమె స్థానంలో వేరొకరిని నియమించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రస్తుతం బాగానే విధులు నిర్వహిస్తోంది

ఈ విషయమై ప్రజాశక్తి దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి హిమబిందుకి వివరణ కోరగా గతంలో సత్యవతిపై విధులు సక్రమంగా నిర్వహించలేదని ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఆమెను పిలిపించి మందలించి విధులు సక్రమంగా నిర్వహిస్తానని లిఖిత పూర్వక లేఖను కూడా తీసుకున్నాము. ప్రస్తుతం బాగానే విధులు నిర్వహిస్తోంది.

-హిమబిందు,
పిహెచ్‌సి వైద్యాధికారి

మలబార్ 'హంగర్ ఫ్రీ వరల్డ్'

ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వరల్డ్ హంగర్ డే సందర్భంగా 'హంగార్ ఫ్రీ వరల్డ్' పథకం పేరుతో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో 70వేల ఉచిత భోజనాలు పంపిణీ చేయాలని మలబార్ సంస్థ నిర్ణయం తీసుకుందని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సిరిపురం మలబార్ షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మలబార్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు 4,100 భోజనాలు అందించాలనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని తనచేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ఈ సంస్థ విద్యా సామాజిక సంక్షేమ పథకం కింద దేశవ్యాప్తంగా 716 మైక్రో లెర్నింగ్ సెంటర్లను స్థాపించిందని, వీధిబాలలకు ప్రాథమికవిద్య పోషకాహారం అందిస్తోందని ఇప్పటివరకు 32,000 మంది పిల్లలు ఈ సెంటర్లలో చేరగా, 9,000 మంది పాఠశాలల్లో చేర్పించబడ్డారని దానల్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ ప్రాజెక్టు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం మలబార్ జోనల్‌హెడ్ ఫిబిన్ మాట్లాడుతూ తమ వార్షిక సిఎస్‌ఆర్ బడ్జెట్‌లో 60 శాతం నిధులను, నిరుపేదల ఆకలి తీర్చడం ,పేదరికాన్ని నిర్మూలించడానికి ఉద్దేశించిన కార్యక్రమాల కోసం మలబార్‌గ్రూప్ కేటాయించిందని, గత సంవత్సరం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోని బాధిత కుటుంబాల్లోని పిల్లల ఉన్నతవిద్యకు మద్దతు ఇచ్చేందుకు మలబార్ గ్రూప్ 'ఉయిర్పు' ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించిందని, 'గ్రాండ్‌మా హోమ్స్' అనే కార్యక్రమాన్ని కూడా మలబార్ గ్రూపు ప్రారంభించిందన్నారు. నిరాశ్రయులైన మహిళలకు ఈ హోమ్స్‌లో ఉచితవసతి సంరక్షణ అందించడానికి షెల్టర్స్ నిర్మించారని ఆయన తెలిపారు.



హంగర్ ఫ్రీ వరల్డ్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఆస్తి పన్ను సర్వే విరమించాలి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : ఆస్తిపన్ను సమీక్ష చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయాలని, ఇంటి పన్ను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వార్వా, నివాస్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి మాట్లాడుతూ, ఆస్తిపన్ను సర్వే విరమించాలని, ఇంటిపన్ను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ 10 వేల కరపత్రాలను అపార్ట్‌మెంట్లు, నివాస కాలనీలలో పంపిణీ చేసి ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. ఇప్పటికే ఆస్తిపన్ను రద్దు చేయాలని కోరుతూ వేలాది వినతి పత్రాలను సిటీలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు ముఖ్యమంత్రికి పంపించామని తెలిపారు. బుధవారం 300 వినతి పత్రాలను పంపించామన్నారు. పట్టణాల్లో ఆస్తుల సర్వే ద్వారా 20 శాతం అదనంగా ఆస్తిపన్ను సమీకరించాలని రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దానికనుగుణంగా ఈనెల 14వ తేదీన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర విభాగం సర్క్యులర్ జారీ చేసిందన్నారు.

ఇంటి పన్ను విధానం నుంచి ఆస్తి పన్ను విధానానికి మార్చడం వల్ల ప్రతి ఏడాది 15 శాతానికి తక్కువ కాకుండా గత ఐదేళ్లుగా పన్ను పెరుగుతూ వస్తుందన్నారు. 2021 లో చెల్లించిన ఇంటిపన్ను, ఆస్తిపన్నుగా మారి, 2025 ఏప్రిల్ నాటికి 100 శాతానికి పెరిగిందని వివరించారు. ప్రతిసంవత్సరం 15 శాతం పెరిగే ఆస్తిపన్ను రద్దుచేయాలని తాము పోరాడుతున్నామని తెలిపారు. అనంతరం జివిఎంసి మేయర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హరిప్రసాద్, బి.ఎ.త్రినాథ్‌స్వామి, బంగారు నాయుడు, కుమార మంగళం, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని గిరిజన విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని రామారావుపాలెం గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గిరిజన బాలిక పాంగి దివ్య (14) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దివ్య మండలంలోని వంగసార గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థినిగా చదువుతుంది. వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతుంది. మంగళవారం ఉదయం వంట చేయమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన దివ్య, గ్రామ సమీపంలోని ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఊరికి అటుగా వెళుతున్న వ్యక్తులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - జి.మాడుగుల : మండలంలోని కుక్కిరాపల్లి ఘాట్ రోడ్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పాడేరు నుంచి వస్తున్న బైక్ కొక్కిరపల్లి ఘాట్ వద్ద బ్రేక్ ఫెయిలై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. మృతురాలు జీకే మండలం పాములాయ్ గ్రామానికి చెందిన మహిళ గా గుర్తించారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో పశువు మృతి

విద్యుత్‌స్తంభం పడి మృతి చెందిన పశువు

ప్రజాశక్తి అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డు టైడా సమీపంలో విద్యుత్ స్తంభం కూలి రోడ్డుపైకి పడిన ఘటనలో విద్యుత్ షాక్ తగిలి పశువు మృతి చెందింది మంగళవారం ఈదురుగాలులు వర్షం బీభత్సవంతో ఈ ఘటన చోటుచేసుకుంది.గాలివాన దాటికి విద్యుత్ స్తంభం ఒకసారిగా కుప్ప కూలింది. అటుగా వెళుతున్న పశువు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.

నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు : కేసి మహేంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నాంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెనుస్ట్రల్ డే పురస్కరించుకుని మెనుస్ట్రల్ హైజీన్ ర్యాలీని పాడేరులో నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కలెక్టరేట్ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌమార బాలికలకు తిరిగి ఉపయోగించే మెనుస్ట్రల్ కప్స్‌ను సరఫరా చేయాలని ఆయా సంస్థలను కోరారు. ర్యాలీ కలెక్టరేట్ నుండి తలారిసింగి కూడలి వరకు నిర్వహించారు.కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్‌ఓ కె.పద్మలత, ఎస్ఎస్ఎ ఎపిసి స్వామినాయుడు, డ్వామా పిడి విద్యాసాగర్, కేసి మహేంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నాంది ఫౌండేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

31న బిటెక్ విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భువనేశ్వర్ (ఐఐటి) బిటెక్ విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ఇంజనీరింగ్ విద్యపట్ల చక్కని అవగాహన కల్పించేందుకు 2025 సంవత్సరానికి ఓపెన్ హౌస్ (అవగాహన సదస్సు) నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సదస్సుకు ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారికి వసతి కల్పించే విధంగా హైబ్రిడ్ విధానంలో నిర్వహి స్తున్నారు. బిటెక్ ఇంజనీరింగ్ సెషన్ ఈ నెల 31వ తేది శనివారం విశాఖ గీతం యూనివర్సిటి, శివాజీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సదస్సుకు హాజరైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు నేరుగా సంస్థ డైరక్టర్, అధ్యాపక బృందాలను కలుసుకుని తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. అంతేకాక విద్యార్థులకు లభించు మద్దతు వ్యవస్థలు (సపోర్టింగ్ సిస్టమ్స్) భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు గురించి తెలుసుకునే అవకాశం కల్పిస్తారు. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటికి సంబంధించి విద్యార్థుల సందేహాలు కూడా ఈ సెషన్స్‌లో నివృత్తి చేస్తారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

అసత్య వార్తలు ప్రచారం చేయొద్దు : పోలీస్ శాఖ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కొన్ని రోజులగా పలు సామాజిక మాధ్యమాల వేదికగా పోలీస్‌వారి విజ్ఞప్తిగా వస్తున్న అత్యవసర పరిస్థితుల్లో తప్ప 3,4 రోజుల వరకూ ఇళ్లను వదిలి బయటికి రావద్దని మనవి. నగర పరిధిలో అనుమానాస్పద కదలికలు ఉన్నాయని దయచేసి పోలీసు, ఆర్మీ బలగాలకు సహకరించాలని వివిధ ప్రదేశాలలో ప్రజలు సంచరించడం నిషిద్ధం' అని వస్తున్న ప్రకటనల్లో వాస్తవం లేదని ఇటువంటి వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఆందోళన కలిగించే ఇటువంటి అవాస్తవ ప్రకటనలు ప్రచారం చేయవద్దని ఆ విధంగా చేసినట్లైతే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

నేటి నుంచి యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నుంచి సచివాలయ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. యోగా అసోసియేషన్ సభ్యులతో బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్షించారు. సచివాలయానికి తొమ్మిది మంది చొప్పున యోగా శిక్షణకు ఎంపిక చేశామని, వారందరికీ మాస్టర్ ట్రైనర్లు పక్కాగా శిక్షణ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 29, 30, 31 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని, వారి ద్వారా సాధారణ పౌరులకు శిక్షణ అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే యోగాసనాలపై నిర్వహిస్తున్న పోటీలను పకడ్బందీగా జరిపించాలని చెప్పారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తొట్లకొండలో జూన్ 1వ తేదీన నిర్వహించనున్న యోగా ఈవెంట్‌కు అధికారులు సన్నద్ధంగా ఉండాలని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని జెసి ఆదేశించారు. జూన్ 8న పోర్టు స్టేడియంలో జరిగే సీనియర్ సిటిజన్ యోగా కార్యక్రమ నిర్వహణకు కూడా పక్కా ఏర్పాట్లు చేయాలని, తగిన విధంగా శిక్షణ అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్, యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు 4 సెంట్లు భూమి కేటాయించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో జర్నలిస్టులకు 4 సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఎపియుడబ్ల్యుజె) బుధవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జిల్లాలో ఆనందపురం, సబ్బవరం, పెందుర్తి మండలాల్లో ఇప్పటికే పేదల ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ జరిగిందని, కొంతమంది లబ్ధిదారులకు కేటాయించగా మిగిలిన స్థలాన్ని జర్నలిస్టులకు కేటాయించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ సీనియర్ నాయకులు బి.నారాయణరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.హరినాథ్, రవి ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎపియుడబ్ల్యుజె నాయకులు